# అయిదో ఇల్లు

## - రజని

"వద్దు ఇంకాసేపు పోనియ్యి" మొరాయిస్తున్న కళ్ళరెప్పల్ని అతి బలవంతంగా విప్పి లేచి పక్కబట్టలు మడతలు పెట్టింది శాయమ్మ. నులక మంచం మీద మొగుడు మల్లేశు గుర్రెట్టి నిద్రపోతున్నాడు. కింద చాపమీద వరసగా ఒంటిమీద తెలివి లేకుండా నిద్దరోతున్న ముగ్గురు పిల్లలని ఓసారి కంటినిండా చూసుకుంది. చెదిరిపోయిన చిరుగుల పాతనే చలెయ్యకుండా వాళ్ళకి సరిగా కప్పింది.

పాచిమొహం కడుక్కునొచ్చి తల ఆరాగా వేళ్ళతో దువ్వి జుట్టు ముడేసుకుని గోడకి వేలాడదీసి వున్న చిన్న చెక్క అద్దంలో బొట్టు దిద్దుకుంది.

చీర మరోసారి సర్దుకుని సిల్వర్ టిఫిన్ కారేజి చేతపట్టుకుని వీధి తలుపు దగ్గరికి చేరేసి తూరుపు రేఖలు ఇంకా ఇంకా పూర్తిగా విచ్చుకోకుండానే రోడ్డుమీదకి వచ్చింది.

రెండో వీధి తిరిగేసరికి వాడకట్టు అంజమ్మ ఎదురుపడింది. ఇద్దరూ పనిచేసే జాగా ఒకటే.

"ఏం శాయక్కా. టీనీళ్లు తాగి వస్తున్నావా లేదా?" అని పలకరించింది.

శాయమ్మ ఓ నిట్టూర్పు విడిచింది.

"ఎక్కడే – ఈ వానాకాలం వేడిగా ఓ చుక్క తాగొస్తే బాగానే వుండు కానీ స్టౌలో కిరసనా యిలు లేదాయె. అయినా పనికాడ ఎవరో ఒకరు పోస్తరులే."

"ఏమైనా నీ పని బాగానే వున్నదిలే. నువ్వు తిరిగొచ్చేవరకు మల్లేశు పిల్లల్ని చూసుకుంటడు. మేలే కదా" అంది అంజమ్మ.

"ఏం చూస్తాడు! ఇద్దరు పోరళ్లని పెద పిల్లకే వప్పజెబుతడు. ఆ గుంటకేమి తెలుస్తది వీళ్ళకి పాలు పట్టాలో నీళ్లు పట్టాలో. వాళ్ళ నాయన పైసలిస్తే కొట్టుకాడికి పోయి ఇంత రొట్టె తెచ్చి పెడతది. లేకుంటే నేను ఇంటికి పోయేవరకు ఏడుస్తానే వుంటరు" అని దిగులుతో ఏకరువు పెట్టింది శాయమ్మ.

ఆమె పని చేసుకుని ఇంటికి వచ్చేసరికి టైము పదకొండు దాటుతుంది. అంతవరకు బీడీలు కాలుస్తూ మంచంమీద కూర్చుని వుంటాడు మల్లేశు. పెళ్లాం రాగానే రిక్షా తీసుకుని పోతాడు. తను వచ్చేవరకు పిల్లలని జాగర్తగా చూసుకోమని ఒకటికి వందసార్లు చెబుతుంది శాయమ్మ. ఏం లాభం ఆ మాటలన్నా ఆ చెవితో విని ఈ చెవితో వదిలేస్తాడు.

ఏడేళ్ల పిల్ల చిట్టి చిట్టి చేతులతో స్టవ్ వెలిగిస్తుంది. చుట్టుపక్కల షావుకెల్లి టీపొడి, పంచదార రెండు రూపాయలు పెట్టి గ్లాసులో పాలు తెస్తుంది. టీ కలిపి పింగాణి కప్పులో పోసి అందిస్తే తాగుతూ కూర్చుంటాడు తండ్రి.

ఈలోగా ఆ ఇద్దరు పోరళ్లు లేచి తల్లి కనిపించక ఆరున్నొక్కరాగం అందుకుంటారు. రెండేళ్ల చంటా నికి అక్క కలిపిచ్చే టీనీళ్లు అక్కరలేదు. తల్లి కావాలి. చెవులు బద్దలయేలాగా సాగే ఆ ఏడుపుకి పెద్దాడు కూడా లేచి శృతి కలుపుతాడు. ఇక మల్లేశానికి తిక్కరేగిపోతుంది.

"ఏరో, పిచ్చి ఏషాలేశారంటే ఉతుకుతా. టీ తాగి గమ్మునుండండి" తండ్రి అరుపులకి వాళ్ళ ఏడుపు గోల ఎక్కువవుతాయి కాని తగ్గవు.

తండ్రి పూర్తిగా మంచం దిగి లేచొచ్చి పిల్లల్ని బండ బూతులు తిడుతూ నాలుగు దెబ్బలు వేసి "పిల్లోళ్లు అలా ఏడుస్తా వుంటే చూస్తూ నిలబ డ్డావేమే. అలా ఎత్తుకుని రోడ్డుమీదికి తీసుకుపో" అని కసురుతాడు.

పిల్ల ఎక్కిళ్లు పెడుతున్న చిన్నోడిని చంకన వేసు కుని పెద్దాడి చేయి పట్టుకుని వీధిలోకి వస్తుంది. రోడ్డుమీద వచ్చిపోయే వాళ్ళని చూపించి మరిపించే ప్రయత్నం చేస్తుంది.

శాయమ్మ దగ్గర ఏనాడైనా పైసలు కరవైతే ఆ టీనీళ్లు కూడా వుండవు. మండే ఆకలితో పిల్లలు తల్లి వచ్చేవరకు అలా ఏడుస్తూనే వుంటారు.

ఇంటిదగ్గర లేకపోయినా ఈ దృశ్యాలన్ని కళ్ళకి కట్టినట్టే వుంటాయి శాయమ్మకి. ఇంటికి రాగానే పొరుగిళ్లవారు సమాచారంతో సిద్ధంగా వుంటారు.

ఇవాళ మల్లేశు ఏం చేసినాడనుకున్నావు. పక్కింటి అంజమ్మ కూతురు చెప్పుకొస్తుంది. మీ పెద్దాడు కొట్టులో చక్కిలాలు కొనిపెట్టమని మొరాయించినాడే అనుకో. చేతిల పైసలు లేకపోతే ఎట్టాగో ఊరడించాలగాని చిన్న పిల్లగా డిని అలా కట్టె తీసుకుని గొడ్డును బాదినట్టు బాదతాడు" అని ఆశ్చర్యం వ్యక్తపరుస్తుంది.

"ఓరమ్మో. రెండు గంటలైనా ఏడ్చినాడు నీ కొడుకు."

విని శాయమ్మ కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆడి జిమ్మడ, ఆడి చేతులు ఇరగ అని గొణుక్కుంది.

ఏమైనా కన్నతండ్రి కదా. పసివాడిని ఎలా కొట్ట బుద్దయిందో. ఎప్పుడూ మందుమీదుంటాడు. ఆడి సంపాదనంతా మందుకే తగలెట్టుకుంటాడు. ఏం చేస్తుంది. దినము ఒళ్లు విరిగిపోయేలా ఇళ్లలో పనులు చేస్తేసే అందరికీ డొక్కనిండేది.

మల్లేశు రిక్షాతొక్కి సంపాదించిన పదీ పరకా అట్టే మాయమవుతాయి. ఏరోజూ ఇంట్లో నాలుగు రూపాయలు ఇచ్చిన పాపాన పోడు. అడిగి అడిగి విసిగి వేసారిపోయింది. ఓరిమి నశించి

"నీ తాగుడు నువ్వు గంగలో కలవా. పిల్లగాళ్ళకి, నాకు కడుపు నిండా అన్నం కూడా లేకుండా చేస్తున్నావు" అని తిడితే ఆమెను ఒళ్లు వాచేలా కొట్టాడు. ఫలితం శాయమ్మ జరం వచ్చి రెండు రోజులు .పనికి వెళ్లలేకపోయింది. కాసేపు ఏడ్చు కుని ఇంతే ఈ బతుకు అని నిర్లిప్తతా ధోరణికి వచ్చేసింది.

కానీ పిల్లల్ని మొగుడు చావబాదితే ఆమె ప్రాణం కలుక్కుమంటుంది.

చిన్నపిల్లలు వాళ్ళమీద చేయి చేసుకుంటావెం దుకు అని అడిగితే కళ్లెర్రజేశాడు మల్లేశు. "నువ్వు ఇల్లు చేరేవరకు పిల్లోళ్ల మంచి చెడ్డా చూస్తున్నదె

వరు. నువ్వు రాణిలాగా పనికి పోతంటే ఇంటికాడ వీళ్ళ గోలతో చస్తన్నా. దానికే సంబరపడు. అసలు పిల్లోళ్ళని చూసే పని ఆడోళ్లదే."

"మరి... నువ్వు ఇంటికి అవసరమైనవేవీ తేవై తివి. నేను రెక్కల కష్టం చేస్తేనే అందరికీ బువ్వ దొరికేది. పిల్లోళ్లని నేను చక్కదిద్దుకుంట. నువ్వు రోజుకు ఏభై రూపాయలు సంపాయించి పెట్టు" అంది శాయమ్మ.

"ఏమే మాటలు జోరుగా వస్తున్నాయి. ఆళ్లని కనుకున్నది నువ్వే. పోషణ కూడా నువ్వే చెయ్యాల" అని సుప్రీంకోర్టు చీఫ్ జడ్జి ఫైనల్ తీర్పంత కచ్చితంగా చెప్పాడు మల్లేశు.

అంతేనా ఆడది సంపాదించి పిల్లలకి పెట్టుకోవడం మరి మగాడు. ఇల్లు గడిచిపోతోంది అన్న ధీమాతో చెడు వ్యసనాల వైపు పోతుంటాడు.

శాయమ్మకి తాను పనిచేసే ఇళ్లలో సంగతులు గుర్తొచ్చాయి. సరోజినమ్మ ఉద్యోగం చేయకుండా ఇంట్లోనే వుంటుంది. ఇద్దరు పిల్లలు. మొగుడు విసుక్కుంటూ రోజూ ఆఫీసుకు పోయి వస్తాడు. పక్కింటి ముకుందరావు పెళ్లాంలాగా భార్య ఉద్యోగం చేయడంలేదన్న చిరాకు అతని ప్రతిమాటలోను బయటపడుతూనే వుంటుంది. అలా మొద్దులా నిలబడి దిక్కులు చూడకపోతే వేన్నీళ్లు తోలిపి బాత్‌రూంలో పెట్టరాదు. ఎలానూ ఉద్యోగం సద్యోగం లేదు అని వెక్కిరిస్తాడు.

సరోజినమ్మ అవమానం దిగమింగుకుంటూ భర్తకి అన్ని సేవలు చేస్తుంటుంది.

ఉద్యోగం చేయకపోయినా ఆయమ్మ ఏం సుఖపడి పోతున్నదని అలా కాల్చుకు తింటాడు మొగుడు. శాయమ్మ ఆశ్చర్యపోతుంది. ఇంట్లో చాకిరీ తక్కువుంటదా. భార్య వుండగా మరో పనిమనిషి ఎందుకు దండగని అతని అభిప్రాయం. ఇంటెడు చాకిరీ సరోజినమ్మే చేసుకుంటూ వుంటుంది.

వాళ్ళింటి పక్కనే వున్న ముకుందరావు ఇంట్లో గిన్నెలు తోముతుంది శాయమ్మ. రోజుకోరకం చీర కట్టుకుని కళ్ళకి కూలింగ్ గ్లాసెస్, పెద్ద హ్యాండ్ బ్యాగ్‌తో మొగుడి వెనకాల స్కూటర్‌పైన వెళ్లే శరణ్య అదృష్టవంతురాలే అనుకుంది శాయమ్మ. కానీ వాళ్ళ ఇంట్లో పని మొదలుపెట్టిన వారం రోజులకే ఆ అమ్మ నవ్వులు అన్నీ పైపై పూత లేనని తెలుసుకుంది. డబ్బు విషయంలో ఇద్దరి మధ్య ఎప్పుడూ గొడవలే. అతడు తన సంపాదనని హాయిగా ఖర్చుపెట్టుకుంటాడు. ఆమె సంపాదనతో ఇల్లు నడపమంటాడు.

"నేను ఉద్యోగం చేయడం మిమ్మల్ని బాధ్యతల నుంచి తప్పించడానికి కాదు. నా సొంత అవసరాల కోసం, ఇంట్లో చిన్నాచితక ఖర్చుల కోసం ఉద్యోగం చేస్తున్నాను. అంతేగాని పూర్తిగా ఇంటి బాధ్యత నేనెందుకు భరించాలి" భర్తతో ఎంత వాదించినా అతను వినడు. తనను ఎదిరించి ఇద్దరు పిల్లల తల్లి ఆ గుమ్మందాటి బయటికి వెళ్ళలేదు అని అతని ధీమా. ఆమె మాటలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వెళ్ళిపోతాడు.

తను... మోసపోతోందని గ్రహించుకుని శరణ్య మనసు దుఃఖంతో, క్రోధంతో నిండిపోతుంది. చదువుకునే రోజుల్లో ఎంతో అమాయకంగా కలలు కన్నది. జీవితాన్ని ఎలా ఊహించుకున్నదో జ్ఞాపకం వచ్చి పిచ్చిగా నవ్వాలనిపిస్తుంది.

కాలేజి డిబేటులో ఆవేశంగా ఉపన్యాసాలు ఇచ్చేది. "స్త్రీలకి సమాన హక్కులు వుండాలి అని. ముందు అందరూ చదువుకోవాలి. ఆ చదువుని వృధా చేయకుండా ఎంతో కొంత సంపాదించాలి. అంతేగాని తిండికి బట్టకి మగవాడి మీద ఆధారపడితే వాళ్ళకి లోకువై పోతాము" అని స్నేహితులకి చెప్పేది. తను బ్యాంకులో జాబ్ చేస్తోంది. అసలు ముకుందరావు తన ఉద్యోగం చూసి చేసుకున్నాడన్నదే నిజం. సరే పెళ్లి అయిన తరువాత ఇద్దరూ ఉద్యోగస్థులైతే సంసారంలో ఖర్చు సమానంగా భరించాలి కదా. అతను తెలివిగా తన నెత్తిమీద వేసి తప్పుకుంటాడు. అతనితో ఎంత పోట్లాడినా ప్రయోజనం లేదు. ఆ ధోరణి మారదు.

అతని జీతం విలాసాలకు ఖర్చు చేసుకుని తన జీతంతో సరుకులు ఇంటి అద్దె కరెంటు ఖర్చు ఇవన్నీ గడపమంటాడు.

శాయమ్మ రెండు రోజులు వరసగా పనికిరాలేదు. మూడో రోజు నీరసంగా వచ్చింది. చెంపలు వాచి పోయి వున్నాయి. కాలుమీద పెద్ద దెబ్బే తగిలింది. వాచిపోయింది. దెబ్బలకి వచ్చిన జ్వరం ఇంకా తగ్గలేదు కాబోలు ముక్కుతూ మూలుగుతూ అలాగే గిన్నెలు తోమింది.

పశువుకంటె హీనంగా ప్రవర్తించి అలా కొడుతుంటే ఆ మొగుడితో ఎలా సంసారం చేస్తోందో.

బియ్యం పప్పలూ తెచ్చి వండిపెడితే తిని తిరిగి ఆమెనే చితకబాదుతున్నాడు మొగుడు. "ఇదేమ న్యాయం. నువ్వు గట్టిగా పోట్లాడు. నా సొమ్ము తింటూ నిన్ను కొట్టే అధికారం అతనికెక్కడిది" అనబోయి ఆగిపోయింది. అరక్షణంలో తన ఆలోచనకు తనే సిగ్గుపడింది శరణ్య. మరి తను చేస్తున్నదేమిటి శాయమ్మ మొగుడు ఆమె శరీరాన్ని హింస పెడుతుంటే తన మొగుడు మాటలతో నిమిష నిమిషం తన మనసు గాయపరుస్తాడు. శాయమ్మ చదువుకోలేదు కనుక శారీరక శ్రమ చేసి సంపాదిస్తోంది. తను ఆఫీసులో పనిచేసి మానసికంగా అలసిపోతుంది. అంతే తేడా. సంసార జీవితాలు ఓ తీరుగానే వున్నాయి.


పక్కింటి సరోజిని పరిస్థితి కొంత నయమేమో. ఏదో ఒక చోట చాకిరీతో జీవితం వెడుతోంది. తనకీ శాయమ్మకీ ఇంటా బయటకా చాకిరీనే.

ఆడది సంపాదించినా సంపాదించకపోయినా మొగుడు లోకువగానే చూస్తున్నాడు. స్త్రీని మనిషిగా చూడగలిగే సంస్కారం వున్న మగవాళ్లు జన్మించే వ్యవస్థ కాదు ఇది. ఆడవాళ్ళు చదువు ద్వారా, ఉద్యోగం ద్వారా అభ్యుదయం కోరుకుంటుంటే అది చివరికి స్వలాభానికే వుపయోగించు కుంటున్నాడు.

ఈ వ్యవస్థ ఎలా బాగుపడుతుంది. శరణ్య ఆలోచిస్తూ కూర్చుంది.

నా పరిస్థితి నీలానే వుంది శాయమ్మా. కాకపోతే నా మొగుడు నాజూకుగా తిడతాడు. అంతే తేడా.





# హైకూలు

టెలిఫోను తీగలపై మౌనులై గువ్వలు
ఎవరో మహా విద్వాంసుడి తాలూకు
నొటేషను గీతలపై స్వర చిహ్నాలు ...

కొండల్లో కోయిలల అరుపులకు
తోటలో నుండీ ప్రతిస్పందన
వసంతాగమనపు అంచెల సందేశం ...


పొద్దు పొద్దుకీ సూర్యచంద్రుల్ని
బంతుల్లా ఎగరేసి పట్టుకుంటోంది
సర్కస్‌లో భూదేవికి ఎంత ప్రావీణ్యం?

అగరుబత్తీ ధూపంగా మారి
అక్కడక్కడే తిరుగుతోంది
భౌతిక కాయంపై తెగని వ్యామోహం ...

తెల్లారితే రాజ్యం పరాధీనం
చంద్రుడు అస్తమించాడని
తారకలందరూ దూకేస్తున్నారు ...

హృదయమెప్పుడో భగ్నమంది
కాలం నివురులా కప్పేసినా
రాత్రి కల నిప్పింకా వుందని చెప్పింది

– వంగీపురం కిషోర్,
అనంతపురం.




పిల్లల స్కూలు ఫీజులు, ఇంటి ఖర్చులు సమస్తం నా జీతంతోనే గడవాలి. లోలోపలే గొణుక్కుంది శరణ్య.

"ఒకవిధంగా నువ్వే నయం. ఉన్న కష్టాలేవో నలుగురికీ చెప్పకునే ధైర్యం, తోటి వాళ్ళ సానుభూతి మీకుంటాయి. మేము మధ్యతరగతి వాళ్ళం. సభ్యత ముసుగు వేసుకుని మాలో మేమే కుమిలి కుమిలి పోతాం. ఏ ఒకరికీ తోటి ఆడదాని సాయం వుండదు" శరణ్య మాటలు అర్థంకాక శాయమ్మ విస్తుపోయి చూసింది.

ఆమె ఇచ్చిన అన్నం కూరలు గిన్నెలో సర్దుకుని మెల్లిగా ఇంటికొచ్చింది.

ఈ అన్నం పిల్లలకి సరిపోతే మొగునికీ తనకీ వండాలి. కిరసనాయిలు లేదు. రేషన్ బియ్యం అయిపోయాయి. ఎక్కడైనా అప్పతెచ్చి ఈరోజు గడపాలి.

ఇంటికొచ్చాక అక్కడ పరిస్థితి చూసి ఆమె నీరసం మరింత ఎక్కువైంది.

ఇంటి నిండా దండాలపై మాసిన బట్టలు పిల్లలు ఆటలాడి చిమ్మిన సామాను. ఎక్కడపడితే అక్కడ పడున్న సిల్వరు పళ్లాలు, గ్లాసులు.

ఇద్దరు పిల్లల్ని సముదాయించలేక అవస్థపడుతోంది పెద్దపిల్ల.

ఇదేమి పట్టనట్టు గోడకి చేర్లబడి బీడీ కాల్చుకుంటున్నాడు మల్లేశు.

ఇంతాలీసం అయిందేం. పిల్లాడు పక్కబట్టలన్నీ ఖరాబు చేసిండు. ముందు అవన్నీ పోయి ఉతుకు. ఇంట్ల సామాను మంచిగ సర్దు. ఓ గంట పోయినంక వస్త" అని లేచాడు రిక్షా తీస్తూ.

"ఇదుగో. ఉల్లిగడ్డలేసి పులుసెట్టు. రెండు గుడ్లు తెచ్చి అట్టు పొయ్యి" అని బయటికి పోయాడు.

గొంతులో నుంచి దుఃఖం ఎగిసిపడుతుంటే ముగ్గురు పిల్లల్ని చేతులు నెప్పెట్టేలా కొట్టి ఇల్లంతా ఆగం చేసినందుకు వాళ్ళని తిడుతూ కొంగు నడుముకు దోపి చీపురు తీసుకుని ఇల్లు ఓ కొలిక్కి తీసుకురావడానికి ఉద్యుక్తురాలైంది.

ఈ ఇల్లు అతనిది. యజమాని అతను. అందుకే ఆజ్ఞాపించి వెళ్లిపోయాడు. చెప్పినట్టు చేయకపోతే మళ్ళీ బడితపూజ చేస్తాడు.

శాయమ్మకి ఎందుకో... ఈ ఇల్లు నచ్చడంలేదు. ఇంట్లో ఎంత చాకిరీ చేసినా దండగే.

ఆమె పనిచేసే మిగతా నాలుగిళ్లలో శ్రమకి ఓ పరిమితే వుంది. పనికి తగ్గ ప్రతిఫలం వస్తుంది కానీ ఈ ఆయిదో ఇంట్లో చాకిరీ ఎంత చేసినా తీరదు. పైగా లభించేవి తిట్లూ, దెబ్బలే.

నాలుగిళ్లలో ఎన్ని పనులు చేసినా రాని విసుగు ఈ అయిదో ఇంట్లోనే ఎందుకు వస్తుందో శాయమ్మకి అర్థం కాలేదు కానీ... విలువలేని శ్రమ కనకనే తనకీ అయిదో ఇల్లు నచ్చడంలేదని శాయమ్మ గ్రహిస్తే ఈ సామాజిక వ్యవస్థ కుప్పకూలి మాతవత్వానికి మార్గం ఏర్పడుతుందేమో.

●